



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమస్యల్లో సంగీత కళాశాల

- 'సీమ'కు తలమాణికం కర్నూలు సంగీత కళాశాల - సొంతభవనం లేదు -రెగ్యులర్ లెక్చరర్లు లేరు

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

రాయలసీమలో ఏకైక ప్రభుత్వ సంగీత కళాశాలను సమస్యలు వెంటాడుతున్నాయి. 52ఏళ్ల క్రితం ఏర్పడిన కళాశాలకు సొంత భవనం లేదు. ప్రిన్సిపల్ మినహా ఎవర్నూ రెగ్యులర్ లెక్చరర్స్ లేరు. అద్దెభవనంలో ఉండటం వలన ఎప్పుడుబడితే అప్పుడు అడ్రస్ మారుతూ పోతుంది. ఈ నేపథ్యంలో సంగీత కళాశాలపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం....

ఆధునిక సమాజం ఆవిర్భవించిందని...ప్రతి మనిషీ వయోపరిమితులు లేకుండా మొబైల్ ఫోన్లకు బానిసైన ప్రపంచాన్ని మనం చూస్తున్నాం. కానీ ఆధునికతను అందిపుచ్చుకుని లలితకళల పట్ల మక్కువతో లలితకళలను నేర్చుకుని ప్రదర్శించి ఈ సమాజాన్ని..బిజీబిజీ అని బతుకుతున్న మనుషులకు తమ కళల ద్వారా మానసిక ఆనందాన్ని కలిగించి మానసిక వ్యాధులకు చికిత్స చేస్తున్న కళాకారులు ఎందరో ఉన్నారు. అటువంటి లలితకళలలను బతికించే ప్రభుత్వ సంగీత కళాశాల కర్నూలులో ఉండటం కర్నూలు ప్రజలకు గర్వకారణం. రాయలసీమలోనే ఏకైక ప్రభుత్వ సంగీత కళాశాలగా పేరొందిన ప్రభుత్వ శారద సంగీత నృత్యకళాశాలలో మృదంగం, వయోలిన్, గాత్రం, నాదస్వరం, కూచిపూడిలలో శిక్షణ ఇస్తారు.

సంగీత అభిమానులు, రాజకీయ నాయకులు సంగీతంపై వారికున్న మక్కువ ఫలితమే రాయలసీమలోని 4 జిల్లాలకుగానూ కర్నూలులో మాత్రమే ప్రభుత్వ సంగీత కళాశాల ఏర్పడటానికి కారణమైంది. సంగీత అభిమానులలో ఒకరైన వేముల రామకృష్ణ 1968 సంవత్సరంలో ప్రైవేట్ యజమాన్యంగా సంగీత కళాశాలను కర్నూలులో స్థాపించారు. అప్పటిలో దానికి వారే వ్యవస్థాపకులుగానూ, కరస్పాండెంట్ గానూ బాధ్యతలను నిర్వర్తించారు. ప్రముఖ సంగీత విద్వాంసులైన కర్లపాళెం చంద్రమౌళిని కళాశాలకు మొదటి ప్రిన్సిపల్‌గా రామకృష్ణ నియమించారు. గాత్ర అధ్యాపకురాలుగా జెఎల్. శకుంతల, నాదస్వర అధ్యాపకులుగా ఎంఎస్.అయ్యప్ప,వయోలిన్ అధ్యాపకులుగా ఎస్ఎల్ఎన్.శాస్త్రి, డోలు ఆధ్యాపకులుగా వెంకటస్వామిలు ఇక్కడ పనిచేశారు. న్యూ ఇండియా అస్యూరెన్స్‌లో మేనేజర్‌గా పని చేస్తున్న రామకృష్ణ కళాశాల కరస్పాండెంట్‌గా కూడా బాధ్యతలను నిర్వహిస్తూ నంద్యాల ఎంపీ అయిన పెండేకంటి వెంకటసుబ్బయ్య సహకారంతో 1973సంవత్సరంలో ప్రయివేటు సంగీత కళాశాలను ప్రభుత్వంలో విలీనం చేయించారు. అప్పట్లో సాంస్కృతిక వ్యవహారాలను కూడా పర్యవేక్షిస్తూ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఇ.ఎ.రెడ్డి, సంగీత కళాశాలకు మరిన్ని అవసరాలను ఈ కళాశాలలో అమర్చారు. వేముల రామకృష్ణ, చంద్రమౌళి కోరిక మేరకు కళాశాలకు కావాల్సిన ఇతర ఆఫీసు సిబ్బందిని, అదనపు అధ్యాపకులను ప్రభుత్వం నియమించింది. ఆఫీసు సిబ్బందిలో ఇ. ఆదికేశవయ్య, ఎస్.శకుంతల సుందరేశ్వర శాస్త్రి, విశ్వనాథం, సూర్యనారాయణ, వెంకటస్వామి, లక్ష్మీనారాయణ, బసన్న తదితరులు నియమితులయ్యారు. కాలానుగుణంగా పోస్టులు రావడంతో కళాశాల అనివృద్ధి బాగా జరిగి నేర్చుకునే వారు అధికమయ్యారు. సంగీత విభాగం నందు అధ్యాపకులుగా జెఎల్.శకుంతల, అయ్యప్ప, వెంకటస్వామి, ఎస్ఎల్ఎన్ శాస్త్రీ, పి.చల్లప్ప, మునిప్రకాష్, నారాయణ వంటివారు చేశారు. ప్రిన్సిపల్ కొమండూరు శేషాద్రి ఆధ్యాపకులుగా పి.సత్యనారాయణ, పిబిపి.శ్రీనివాస్, ఎస్‌వి.రమణమూర్తి, జి.రామచంద్రన్, కె.వరలక్ష్మి, సి.జ్యోతిర్మయి, సి. మునికుమార్‌లు పనిచేశారు. ప్రస్తుతం మునికుమార్ ప్రధానాచార్యులుగా ఉన్నారు. రాయలసీమలో ఏకైక సంగీత కళాశాలగా రూపు దిద్దుకున్న ఈ కళాశాలకు బాల మురళీకృష్ణ, జేసుదాసు, చిట్టిబాబు, చంద్రశేఖరన్, షేక్ చిన్న మౌలానా, దండమూడి రామమోహనరావు వంటి అంతర్జాతీయ కళాకారులు కూడా వచ్చారు. సంగీత కళాశాల స్థాపనకు పురప్రముఖులు కృషి చేశారు.

సొంతభవనం లేక అద్దెభవనంతో దశాబ్దాలుగా కొనసాగుతున్న దుస్థితిని ఇప్పుడూ ఎదుర్కొంటుంది. ఇప్పటికీ ప్రభుత్వాలు మారినా ..పాలకులు మారినా కానీ సొంత భవనానికి ఆలోచించలేదని పలు విమర్శలు విన్పిస్తున్నాయి. 1973 సంవత్సరం నుండి సంగీత కళాశాలకు సొంత భవనం లేని కళాశాలగా చరిత్రపుటల్లో నిలిచి వుంది. ప్రస్తుతం ఒక్క ప్రిన్సిపల్ మాత్రమే రెగ్యులర్‌కాగా ఉన్నారు. మిగతా లెక్చరర్లు కాంటాక్ట్ ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. నాన్ టీచింగ్‌లో ఒక సీనియర్ అసిస్టెంట్ విధుల్లో ఉన్నారు. కళాశాలకు ప్రతినెలా మితిమీరిన అద్దెలు చెల్లిస్తూ, నగరంలో ఒకవైపు నుంచి మరో వైపుకు మారుతూ కళాశాలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పాతబస్టాండ్ సమీపంలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం దగ్గర ఉన్న వసతిగృహంలో కళాశాల నిర్వహిస్తున్నారు. ప్రభుత్వసొంతభవనంతో పాటు రెగ్యులర్ లెక్చెరర్ నియామకాలు చేయాలని సంగీత అభిమానులు కోరుతున్నారు.



సంగీత కళాశాల అద్దెభవనం

సొంత భవనం నిర్మించాలి

- ఆవుల చక్రపాణి యాదవ్



ప్రభుత్వ శారద సంగీత నృత్యకళాశాలకు రాష్ట్రంలో ఎంతో పేరుంది. ఘన చరిత్ర వుంది. ఇక్కడ చదువుకున్నవాళ్ళు గొప్ప సంగీత నృత్య విద్వాంసులయ్యారు. అటువంటి కళాశాలకు సొంతభవనం లేకపోవడం విచారకరం. ప్రభుత్వం స్పందించి సొంతభవనం నిర్మంచాలి. రోజు ప్రమాదాలు జరుగుతున్నా.. గుంతలు పడ్డ రోడ్డుపై స్పందించని రహదారుల శాఖ అధికారులు.

ఆరుగురు తహశీల్దార్లపై నెగిటివ్ ఫీడ్ బ్యాక్

- కలెక్టర్ పి.రంజిత్ బాషా
- గ్రీవెన్స్‌లో బాధితుల వినతుల ల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సి.బెలగల్, గోనెగండ్ల, కోడుమూరు, నందవరం, వెల్దుర్తి , గూడూరు తహశీల్దార్ల పనితీరుపై నెగటివ్ ఫీడ్‌బ్యాక్ వచ్చిందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అసహనం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. అధికారులు ప్రజలతో ఏ విధంగా ప్రవర్తిస్తున్నారనే అంశంపై ఐవిఆర్ఎస్ ద్వారా తీసుకున్న సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లో మండలాల తహశీల్దార్లకు సంబంధించి నెగెటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చిందన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో నేల సారవంతం

పచ్చిరొట్ట ఎరువులను, జీవన ఎరువులను వాడడం ద్వారా భూమి సారవంతం అవుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో 'పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువుల' వినియోగానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, హౌసింగ్ పీడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అవినీతిని నియంత్రించండి

- కలక్టర్‌కు రెవెన్యూ శాఖపై ఎపి రైతు సంఘం ఫిర్యాదు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రెవిన్యూ శాఖలో జరుగుతున్న అవినీతిని పూర్తిస్థాయిలో నియంత్రించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణతో పాటు రైతు సంఘం సహాయ కార్యదర్శిలు ఎ.కృష్ణ , కోటకొండసూరి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్యదర్శి జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న పాల్గొన్నారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ రెవిన్యూ శాఖలో అవినీతిని పూర్తిగా ప్రక్షాళన చేయాలని కోరారు. గ్రామ సర్వేయర్ నుండి మొదలుకొని విఆర్ఒ ఆర్ఐ తహశీల్దార్ వరకు విచ్చలవిడిగా బడుగు బలహీన వర్గాల రైతుల నుండి ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించి దోచుకుంటున్నారన్నారు. ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామంలో తలారి వసంత అనే రైతుకు 40 సెంట్లు భూమి ఆన్‌లైన్‌లో ఎక్కించడం కోసం మూడుసార్లు రిజెక్ట్ చేశారన్నారు. దీని వెనకాల ఉన్న రహస్యం ఏమిటన్నారు. ఇదే గ్రామంలో ఆన్‌లైన్ సమస్యలు ఎన్నో ఉన్నాయని రైతులు చెప్పడానికి భయభ్రాంతులకు గురవుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. విచారణ చేస్తే అనేక విషయాలు బయటికి వస్తాయన్నారు. వీటితో పాటుగా అనేక భూ సమస్యలు ప్లాట్లలో విఆర్ఒ మహబూబ్‌బాషా విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ ఉన్నారన్నారు. అనర్హులైన వారికి ఎందరికో గతంలో పనిచేసిన తహశీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి పట్టాలు ఇచ్చినట్లు తెలుస్తుందన్నారు. ఎపి సీడ్స్‌లో పని చేసే అధికారులు మీరు అనర్హులైనప్పటికీ ఇచ్చారని తెలిసిందని, కురువ జయన్న ఇంటి వెనకాల చాలామందికి ఇచ్చినట్టు 18 మంది దగ్గర 53 వేల చొప్పున వసూలు చేసుకున్నారన్నారు. మీది వేముల విఆర్ఒగా పని చేసినప్పుడు ఎపిఐఐసిలో పోయిన భూములు పేదవారికి నష్టపరిహారం ఇవ్వకుండా వారి భూములు అయినప్పటికీ విఆర్ఒ , ఇతర పెద్దలు కలిసి పంపిణీ చేసుకున్నారన్నారు. అది మనసులో పెట్టుకొని ఇప్పుడు జరిగిన హత్య కూడా ఇది ఒక భాగమని ప్రజలందరూ కూడా చెప్పుకుంటున్నారన్నారు. పత్రికల్లో కూడా వార్త వచ్చిందన్నారు. విఆర్ఒ మహబూబ్ బాషాపై ఒక సమగ్రమైన దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. కల్లూరు మండలం చెట్ల మల్లాపురం గ్రామంలో శివప్రసాద్ భూమిని ఆన్‌లైన్ చేయడం కోసం రూ.లక్షలు డిమాండ్ చేసి కొంత అమౌంట్ తీసుకున్నట్టు సమాచారం ఉందన్నారు . కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలో రైతు ఉగాది గిడ్డయ్య 70 సెంట్ల భూమిని సర్వే చేయించడానికి నాలుగు నెలలుగా గ్రామ సర్వేయర్ చుట్టు తిరుగుతున్నా సర్వే రిపోర్ట్ ఇవ్వలేదన్నారు. దానికి కారణం సెంటుకు 500 చొప్పున రూ.35 వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటన్నిటిపై సమగ్రంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత విఆర్వోలపై తగు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ను ఆదేశించారు.

రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి

- కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జోహారాపురం నుండి వెంకాయపల్లె రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల డిమాండ్ చేశారు. సిపిఎం ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో జోహారాపురం నుండి వెంకాయ పల్లె వరకు రోడ్డును, ఇరువైపుల కాలువలను నిర్మించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నగర కమిటీ సభ్యులు మహమూద్ అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి రాష్ట్ర కమిటీ సభ్యులు నిర్మల, ఓల్డ్ సిటీ కార్యదర్శి రాజశేఖర్, నగర కార్యవర్గ సభ్యులు విజయ రామాంజనేయులు మాట్లాడారు. జోహారాపురం నుండి వెంకాయపల్లెకు వెళ్లే రోడ్డు నరకానికి రహదారిలా ఉందన్నారు. ఈ రోడ్డు చిరిగిపోయి గుంతలుగా ఏర్పడి వాహనాలు, బాటసారులు నడవలేని పరిస్థితి ఉందన్నారు. గత ప్రభుత్వం దృష్టికి చాలా సార్లు తీసుకెళ్లిన పట్టించుకోలేదన్నారు. కర్నూలు నగర మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు కూడా ఈ రహదారి గుండానే వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే రహదారి దిగ్బంధనం చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించగా రోడ్డు నిర్మాణ పనులను చేపట్టేందుకు ఆర్అండ్‌బి పంచాయతీరాజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న నిర్మల



రోడ్డు మరమ్మతులు చేయరా?

-పన్నులు చెల్లించడం ఆలస్యమైతే ఫైన్లు వేస్తారు
-ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కావు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా కేంద్రానికి ముఖద్వారమైన నందికొట్కూరు రోడ్డుపై వర్షం వస్తే ఏ గుంత ఎక్కడుందో తెలియక స్కూటర్లు, ఆటోలపై వెళ్లే ప్రయాణికులు ప్రమాదాలకు గురై కాళ్లు చేతులు విరిగి గాయాలై ఆసుపత్రుల పాలవుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు రోడ్డు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజానాట్యమండలి నాయకులు డి. సుబ్బారాయుడు, స్థానిక కాలనీ అసోసియేషన్ ప్రతినిధి పిసిహెచ్ దస్తగిరి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి విమర్శించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు సోమవారం ఉదయం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం స్థానికులతో కలిసి నందికొట్కూరు రోడ్డును పరిశీలించారు. వారు మాట్లాడుతూ గణేష్ గుడి సమీపంలో 30 ఏళ్ల క్రితం నాటి మోరి (కల్వర్టు) శిథిలమైంది. ఇరుకు రోడ్డు..వర్షం వస్తే ఏ గుంత ఎక్కడుందో తెలియక శివారు కాలనీలు, గ్రామాల ప్రజలు ప్రమాదాలకు గురై నరకం అనుభవిస్తున్నారు. ఇంటి పన్నులు.. రోడ్డుటాక్స్‌లు చెల్లించడం ఒక్కరోజు ఆలస్యమైతే జరిమానాలు విధిస్తున్నారు. రోడ్లు గుంతలు పడి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేయని అధికారులు ప్రజలకు ఏమి సమాధానం చెప్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పాలకులు నిర్లక్ష్యం వహించారు. కూటమి ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గత ప్రభుత్వం లాగానే ప్రజలు బుద్ధి చెప్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గుంతలు ఉన్న రోడ్ల ఫోటోలను కలెక్టర్‌కు చూపించి, అర్జీ ఇచ్చారు. ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడి తొందర్లో మరమ్మతులు చేయాలని కోరగా ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడి రోడ్డు మరమ్మతులు చేయిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో బి నాగేంద్ర, ఎస్.మాలిక్ బాష, ఎ.ఆంజనేయులు గౌడ్, గోపాల్, హనుమాన్‌జీ పాల్గొన్నారు.

స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గ్రామపంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ నిధులను వెంటనే విడుదల చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు మండలం సర్పంచుల సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. స్టాంప్ డ్యూటీ నిధులు రానందువల్ల గ్రామాలలో ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు ,శానిటేషన్ ,లైటింగ్ మొదలైనవి కల్పించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే జిల్లా పంచాయతీ అధికారి, రిజిస్ట్రేషన్ శాఖ వారిని పిలిచి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మాధవస్వామి, బాలపీర, డి.లావణ్య, కె.మధు, సోమేశ్వరమ్మ, సాగర్,కె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు రూ. 26 వేల వేతనమివ్వాలి

అన్ని యాప్ లను రద్దు చేసి ఒకే యాప్ ను అమలు చేయాలి
సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అంగన్వాడీ వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అనవసరమైన యాప్లను రద్దుచేయాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరుతూ సిఐటియు కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిడిపిఒ ఆఫీస్ ముందు అంగన్వాడీ వర్కర్స్ నాయకులు విజయమ్మ అధ్యక్షతన ధర్నా చేశారు. సిఐటియు రాష్ట్ర నాయకులు పి.నిర్మల, నాయకులు సాయిబాబా, సిఐటియు సిటీ సెక్రెటరీ విజయ రామాంజనేయులు, అంగడి వాడి వర్కర్స్ జిల్లా నాయకులు బాలదుర్గమ్మ మాట్లాడారు. దేశంలో ఉన్న తల్లులందరికి , చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారం లోపం రాకుండా ఆరోగ్యకరంగా ఎదగడానికి అవసరమైన తిండిని, ఆరోగ్య సలహా సూచనలు ఇవ్వడానికి పిల్లలకు చదువు పట్ల ఆసక్తి పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్ ద్వారా స్కీంను కొనసాగిస్తుందని తెలిపారు. ఈ స్కీమును భుజాన వేసుకొని అంగన్వాడీ కార్యకర్తలు కష్టపడి పని చేస్తున్నారన్నారు. ఉన్న పరిస్థితుల కనుగుణంగా పెరిగిన ధరలను బట్టి మాకు జీతాలు పెంచాలని కోరుతూ గత ప్రభుత్వ కాలంలో 42 రోజులు సమ్మె చేస్తే అడిగిన డిమాండ్లను అమలు చేస్తామని రాతపూర్వకంగా రాసి ఇచ్చి మోసం చేశారని, అందుకే ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపారని అన్నారు. కార్మికుల దీక్ష శిబిరాల ముందుకు వచ్చి హామీలు ఇచ్చిన టిడిపి నాయకులు ప్రభుత్వం వచ్చే సంవత్సరం పూర్తయినా సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఏరు దాటాక తిప్ప తగిలేసినట్టు అంగన్వాడిని వర్కర్స్‌ను వేధించే విధంగా మరి కొత్త కొత్త యాప్‌లను తెచ్చి మానసికంగా వేధిస్తున్నారని గుర్తు చేశారు. కనీస వేతనాలు అముల చేసి , ఒకే యాప్ ను అమలు చేయాలని, సంక్షేమ పథకాల అమలు చేసి కుటుంబాలని ఆదుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి అన్ని రకాల అలవెన్స్‌లను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కోడుమూరు రూరల్: అంగనవాడి హెల్పర్స్ అండ్ యూనియన్ ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని కనీస వేతనం రూ26 వేలు ఇవ్వాలని కోడుమూరు ఐసిడిఎస్ ఆఫీస్ వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నానుద్దేశించి అంగనవాడి జిల్లా అధ్యక్షురాలు రేణుకమ్మ, సిఐటియు కోడుమూరు మండల కార్యదర్శి జిపి. వీరన్న మాట్లాడారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌ని రద్దు చేయాలి అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని, ఫ్రీ స్కూలు బలోపేతానికి చర్యలు చేపట్టాలని కోరారు. సీనియర్ అసిస్టెంట్ ముర్తుజావలికి అంగన్వాడి నాయకురాలు అరుణ, రజియా,హైమావతి, భ్రమరాంబిక వినతిపత్రాన్ని సమర్పించారు



కోడుమూరులో వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

ఫేస్ యాప్ ను రద్దు చేయాలి....

పత్తికొండ:అంగన్వాడి టీచర్లకు ఆయాలకు బాలింతలకు గర్భిణీలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని పత్తికొండ ప్రాజెక్టు కార్యదర్శి పద్మజ డిమాండ్ చేశారు. సోమవారం పత్తికొండ పట్టణంలోని సిడిపిఒ కార్యాలయం ఎదుట అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి పద్మజ మాట్లాడారు. అంగన్వాడి టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సిడిపిఒ కార్యాలయ అధికారికి సమస్యలతో కూడిన పత్రాన్ని అందజేశారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు గిరిగెట్ల చిట్టెమ్మ, ఉపాధ్యక్షులుగా కుమారి, కార్యదర్శిపద్మజ, ఆయ కార్యదర్శులు చంద్రకళ, ట్రెజర్ మునెమ్మ, 19 మందితో కమిటీని ఎన్నుకున్నారు.



పత్తికొండ సిడిపిఒ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

అర్హులైన పేదలందరికీ పింఛన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అర్హులైన పేదలందరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలమ్మ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను వికర్ సెక్షన్ కాలనీలోని పేదలతో కలిసి ఆమె వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేదలకు వృద్ధాప్య వితంతు పలు రకాల పింఛన్లను మంజూరు చేయడంలో అలసత్వం వహిస్తుందన్నారు. గత ప్రభుత్వం హయాం నుండి ఇప్పటివరకు అనేకమంది పేదలు అర్హత కలిగినప్పటికీ పెన్షన్లు మాత్రం మంజూరు కావడం లేదన్నారు. అనేకమంది పేదలు పెన్షన్లు అందకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలన పేరుతో ప్రజల్లోకి వచ్చి ఊదరగొట్టు ప్రచారం చేసుకుంటుదన్నారు. పింఛన్ల మంజూరుకు కూడా అనేక రకాల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని నిబంధనలు పెట్టడం దుర్మార్గమన్నారు. అలాంటి నిబంధనలను తొలగించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్లు మంజూరు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆమె జిల్లా కలెక్టర్‌ను కోరారు.



టిడిపి మోసాలపై ప్రజలను వివరించండి

-వైసిపి కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్

ప్రజాశక్తి-సి బెళగల్

టిడిపి అధికారం వచ్చే సమయంలో మోసపూరిత ప్రచారాలు చేసి పీట మెక్కుతుందని ప్రజలను అప్రమత్తం చేయాలని వైసిపి కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జి నాయకులు ఆదిమూలపు సతీష్ మండల నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం సింగల్ విండో మాజీ అధ్యక్షులు గోవింద్ రెడ్డి నివాసంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. టిడిపి అధికారంలోకి ప్రతి సారి పథకాల ఆశ చూపి గద్దెనెక్కడం ప్రజలు మోస పోవడం పరిపాటిగా మారిందని ఇకనైనా మేలుకోవాలని కోరారు. సూపర్ సిక్స్ అన్నారు.. సెవెన్ పథకాలు అన్నారు. వైసిపి పథకాలను అమలు చేస్తూ అదనంగా టిడిపి పథకాలు అంటూ బురిడీ కొట్టించడం తప్ప కూటమికి చేసిందేమి లేదన్నారు. తప్పుడు కేసులు మోపి కేసులు పెట్టి భయపెడితే అదిరే వారు లేరని అన్నారు. 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ, కాదని బాబుష్యూరిటీ మోసం గ్యారంటీ అని తేలిందన్నారు. తల్లికి వందనం తప్ప ఏడాది పాలనలో ఏ సంక్షేమం సాగింది లేదని, సుపరి పాలన కాదని శాపాల పాలన అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సర్పంచులు పాండురంగన్న, కుక్కల, దస్తగిరి, కో ఆప్షన్ మెంబెర్ హరుణ్, కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి, మాజీ కన్వీనర్ నరసింహులు, ఉప సర్పంచి ఇబ్రహీం, గూడూరు కన్వీనర్ నరసింహరెడ్డి, నాయకులు, కార్యకర్తలు శంకర్‌రెడ్డి, బాను ప్రకాష్‌రెడ్డీ, బావికాటి మద్దిలేటి, శ్రీనివాసరెడ్డి, టిజివి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్



ఆశావర్కర్లనుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ

ఆశాల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, కర్నూలులో ఆశా కార్యకర్తలకు ఫిర్యాదుల పరిష్కార వేదికను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి శాంతి కళ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యల వినతి పత్రాలను స్వీకరించి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. ఆశా కార్యకర్తలు అన్నీ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను గ్రామ ప్రజలకు తెలియజేసి వారికి అన్నీ ఆరోగ్య సేవలను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అదికారి డాక్టర్ వై.నాగ ప్రసాద్‌బాబు, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మహేశ్వరప్రసాద్, ఇన్చార్జి డిపిహెచ్ఎన్ఒ అన్నపూర్ణమ్మ, సీనియర్ అసిస్టెంట్ కుతుబుద్దీన్, డిసిఎం ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఈశ్వరయ్య స్వామి

మండల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎంపిడిఒ ఈశ్వరయ్య స్వామి

ప్రజాశక్తి - కోసిగి

మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపిడిఒ ఈశ్వరయ్య స్వామి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పెండేకల్లు ఈరన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశానికి మండలంలోని ఆయా శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు హాజరయ్యారు. శాఖల్లో చేసిన పనులు, చేయాల్సిన అభివృద్ధిపై చర్చించారు. మండలంలో నెలకొన్న సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. స్థానికంగా ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ మెషిన్ ఏర్పాటు చేయాలని, ఇంపాపురం పాఠశాలలో స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థులకు అన్యాయం జరిగిందని, ఈ విషయంపై ఎంఇఒ పూర్తిస్థాయి విచారణ చేపట్టి విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్‌లో సీటు వచ్చే విధంగా కృషి చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. సర్వసభ్య సమావేశానికి ప్రతి అధికారి హాజరుకావాలని, హాజరుకాకపోతే జిల్లా అధికారులకు తెలియజేసి వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ హెచ్చరించారు.

ఆదరణను చూసి ఓర్వలేకనే అరెస్టులు

- వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య

ప్రజాశక్తి - చిప్పగిరి



మాట్లాడుతున్న జూటూరు మారయ్య, నాయకులు

ప్రజల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే రెడ్‌బుక్ పాలన అమలు చేసి మిథున్ రెడ్డిని అరెస్టు చేశారని వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య విమర్శించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లిక్కర్ స్కాం పేరుతో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం అప్రాజస్వామికమన్నారు. వైసిపిలో ఆదరణ కలిగిన నాయకులను రెడ్‌బుక్ పేరుతో అరెస్టు చేస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేక, ప్రజలకు పథకాలు అందించలేకపోతున్నారని విమర్శించారు. వైసిపి నాయకులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వెనక్కి తగ్గడం వైసిపి నేతలకు తెలియదని అన్నారు. కూటమి పాలనలో వైఫల్యాలను ఎత్తి చూపేందుకే వైసిపి అధినేత జగన్ 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నారని తెలిపారు. జూటూరు లింగన్న, లాలూ స్వామి, మురళీ, ఓలయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే 'కూటమి' లక్ష్యం

- టిడిపి యువ నాయకులు రాకేష్ రెడ్డి, రాజారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి, రాజారెడ్డి తెలిపారు. సోమవారం రామచంద్రనగర్, రాఘవేంద్రపురం కాలనీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ముందుగా ఆయనకు గ్రామ నాయకులు వరదరాజు, ఎంపిటిసి బోయ వెంకటేష్, కమ్మరి నరసింహ స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి, కరపత్రాలు అందజేశారు. టిడిపి నాయకులు ఆర్.లక్ష్మయ్య, మంచాల సొసైటీ సంఘం డైరెక్టర్ డిసి.తిమ్మప్ప, బెస్త పవన్ కుమార్, బావిగడ్డ రాఘన్న, రవి, గోవిందు, రమేష్ పాల్గొన్నారు.

నేడు రామాంజనేయులు ప్రమాణ స్వీకారం

- హాజరుకానున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - గోనెగండ్ల



గోనెగండ్ల వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా టిడిపి సీనియర్ నాయకులు, గోనెగండ్ల గ్రామానికి చెందిన ఎన్‌వి.రామాంజనేయులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అలాగే గోనెగండ్ల గ్రామానికి చెందిన కడపల రమేష్, కులుమాల గ్రామానికి చెందిన కురువ వెంకటేశ్వర్లు డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, పిఎసి సభ్యులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. గోనెగండ్లలోని సొసైటీ ఆవరణలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, టౌన్ ప్రెసిడెంట్ మహెల రహమతుల్లా సోమవారం కోరారు.

ఫేస్ యాప్‌లను తొలగించాలి

- గళమెత్తిన అంగన్వాడీలు

ప్రజాశక్తి - ఆదోని

అంగన్వాడీ లబ్ధిదారులకు ఫేస్ యాప్‌లను రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు గళమెత్తారు. సోమవారం ఆదోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ప్రాజెక్టు అధ్యక్షులు వరలక్ష్మి, సరోజ అధ్యక్షతన ధర్నా చేపట్టారు. సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్, మండల అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడారు. అంగన్వాడీలో లబ్ధిదారులకు ఫేస్ యాప్ ద్వారా సరుకులు ఇవ్వాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను తీసుకొచ్చారని, అంగన్వాడీలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు నాణ్యతగా లేకపోవడం, నెట్ సిగ్నల్ సరిగా రాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఒటిపిలో పెట్టి చేయడం చాలా రోజులు పడుతోందని, పూర్తయితేనే లబ్ధిదారులకు సరుకులు మంజూరు చేయాలని అధికారులు చెప్పడం వల్ల వారు అవస్థలు పడుతున్నారని వాపోయారు. కూటమి ప్రభుత్వం, అధికారులు అంగన్వాడీలకు వివిధ యాప్‌లను రద్దు చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం నోడల్ ఆఫీసర్ భార్గవికి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ సెక్టార్ లీడర్లు సోమక్క, రిజ్వానా, లలిత, రేణుక, లక్ష్మీదేవి, గీత, కరుణ, లలిత, రాజేశ్వరి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** ధర్నా చేపట్టారు. అనంతరం ప్రాజెక్టు అధికారి రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు కె.శైలజ, ఎస్.నాగలక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు, నాగేశ్వరమ్మ, గ్రేషమ్మ, మేరీ, అరుణ, పద్మ, మున్ని, భాగ్యమ్మ, లక్ష్మీదేవి, సునీత, ఉర్వదేవి, సుమిత్ర, కుసుమ కుమారి పాల్గొన్నారు. **మంత్రాలయం** ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి, ఐసిడిఎస్ సీనియర్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి హెప్సిబా, కార్యదర్శులు విశాలాక్షి, భీమేశ్వరి, లూసమ్మ, వరలక్ష్మి, సుజాత, జయమ్మ పాల్గొన్నారు. **ఆలూరు** ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఐసిడిఎస్ సీనియర్ అసిస్టెంట్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎపి అంగన్వాడీ మండల నాయకులు జయశ్రీ, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, సిఐటియు నాయకులు కృష్ణ, అంగన్వాడీ నాయకులు బాలరంగమ్మ, భారతి పాల్గొన్నారు. **ఆస్పరి** ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఆస్పరి, దేవనకొండ మండలాల అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్షులు విశ్వాకుమారి, జ్యోతి అధ్యక్షతన ధర్నా చేపట్టారు. అనంతరం సూపర్‌వైజర్ శివ లింగమ్మకు వినతి పత్రం అందజేశారు. సిఐటియు మండల అధ్యక్షులు రామాంజినేయులు, మండల సీనియర్ నాయకులు బాలకృష్ణ, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి రవి, అంగన్వాడీ కార్యకర్తలు రసూలా బేగం, రాధా, లతా, జానకి, లక్ష్మీదేవి, ప్యారది, కవిత, చిట్టెమ్మ, సుజాత, ఖాసీంబీ, ఉరుకుందమ్మ, కుసుంబీ పాల్గొన్నారు.



ఆదోనిలో వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు



ఎమ్మిగనూరులో ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు



మంత్రాలయంలో



ఆస్పరిలో...



ఆలూరులో ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు

అవగాహన రాహిత్యం బాధాకరం : ఎమ్మెల్యే బీవీ

- సహకార బ్యాంకు ఛైర్మన్‌గా ధర్మపురం గోపాల్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - నందవరం

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక అవగాహన లేకుండా మాట్లాడడం బాధాకరమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన నందవరం మండలంలో పర్యటించారు. ముందుగా నందవరం గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే తిమ్మారెడ్డి కొంటను సందర్శించి జలహారతి ఇచ్చారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదామును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గోదాము పరిసర ప్రాంతంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాగునీటి సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ప్రస్తుతం గ్రామానికి తాగునీరందించే తిమ్మారెడ్డి కుంటను నింపినట్లు చెప్పారు. సర్వే చేయించి కుంట నీటి సామర్థ్యం పెరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం మరో రెండేళ్లలో గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా గ్రామానికి నీరందించి ఇంటింటికి కుళాయి ఇచ్చి పూర్తిస్థాయిలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. వైసిపి నాయకులు బుట్టా రేణుక అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. తాను జగన్‌ను విమర్శించడం తప్పని అంటున్నారని, ఆయన నిజంగా రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ లాంటి వారేనని విమర్శించారు. ఎమ్మిగనూరులో నిలిచిపోయిన ప్రభుత్వాస్రతిని ప్రస్తుతం కూటమి హయాంలో ప్రారంభించామని తెలిపారు.

సహకార సంఘం ఛైర్మన్‌గా ధర్మపురం గోపాల్ ప్రమాణ స్వీకారం

నందవరం సహకార సంఘం ఛైర్మన్‌గా టిడిపి నాయకులు ధర్మపురం గోపాల్, డైరెక్టర్లుగా దేవల భీమశేఖర్, నాగలదిన్నె మహేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ... సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తూ రైతులకు న్యాయం జరిగేలా పనిచేయాలని తెలిపారు. ధర్మపురం గోపాల్ మాట్లాడుతూ... మండలంలో ఉన్న రైతులకు సొసైటీ తరపున సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాధవరావు దేశాయ్, నాగరాజ్ గౌడ్, చిన్న రాముడు, ఖాసీం వలీ, వెంకటరామిరెడ్డి, ముగతి ఈరన్న గౌడ్, మిల్లు నారాయణరెడ్డి మాట్లాడారు. గోపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పులిచింత గ్రామంలో బండే గురుస్వామి ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' చేపట్టారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడిపి నాయకులు పుష్పావతి, రాయచోటి రామకృష్ణారెడ్డి, నాగలాదిన్నె నాయకులు ఈరన్న, ఉరుకుందు, ఎన్ఎ.మునాఫ్, జకతి మునాఫ్, శేషాద్రి తిమ్మప్ప, పెద్దకొత్తిలి శేషాద్రి, కైరవాడి వీరేష్, సత్యరెడ్డి, సోమల గూడూరు చంద్రశేఖర్, హాలహర్వి నాయకులు ఎర్రన్న, దావీదు, నాగరాజు, మణి పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బీవీ



గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమం

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా

ప్రజాశక్తి-ఆలూరు



ఆలూరులో మాట్లాడుతున్న అబ్దుల్లా

ప్రభుత్వ నూతన విద్యా విధానంపై, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులు బసవరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శాస్త్రీయమైన విద్యావిధానానికి ఎస్ఎఫ్ఐ పాటుపడుతోందని తెలిపారు. ప్రస్తుతం విద్య కూడా వ్యాపార సరుకుగా మారిపోయిందని, మార్కెట్ మాయాజాలంలో ఇరుక్కుపోయిందని చెప్పారు. సమాజంలో ఎన్ని అసమానతలు ఉన్నాయో అన్నింటినీ నేటి విద్యారంగం కళ్లకు కట్టినట్లు చూపిస్తోందని తెలిపారు. లోతైన పరిశీలన లేకుండా విద్యారంగాన్ని పరిశీలిస్తే... అవకాశాలు పెరిగినట్లు... అందరికీ విద్య అందుతున్నట్లు కనిపిస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మైనా మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రభుత్వ విద్య పూర్తిగా నిర్వీర్యమైందని తెలిపారు. ప్రభుత్వ, సంక్షేమ విద్యారంగానికి ఎస్ఎఫ్ఐ కట్టుబడి ఉందన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కమిటీని 21 మందితో ఎన్నుకున్నారు. కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, అధ్యక్షులుగా బసవరాజు, ఉపాధ్యక్షులుగా మణికంఠ, ఉపేంద్ర, రవి నాయక్, సహాయ కార్యదర్శులుగా సురేష్, శ్రీరామ్, అశోక్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గోవర్ధన్, నాయకులు ఈశ్వర్, మహేష్, నిఖిల్ పాల్గొన్నారు. **కౌతాళంలో** ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిస్కారం కోసం నిరంతరం పని చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండలం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శ్రీనివాసులు, కార్యదర్శిగా విష్ణు, ఉపాధ్యక్షులుగా ఈరన్న, సహాయ కార్యదర్శులుగా సద్దాం, అన్వేష్, కమిటీ సభ్యులుగా 10 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టిడిపితోనే సామాన్యులకు పదవులు

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం


టిడిపి అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసిన సామాన్యులకు పదవులు కట్టబెట్టేది టిడిపి మాత్రమేనని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు తెలిపారు. సోమవారం బదినేహాల్ సహకార సంఘం ఛైర్మన్‌గా బోయ మారెప్ప, సభ్యులుగా నరసింహులు, సోమనాథ్, కౌతాళం సహకార సంఘం అధ్యక్షులుగా అల్లూరి వెంకటపతి రాజు, సభ్యులుగా కురువ వీరేష్, ముల్లా నబిసాబ్ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. రాఘవేంద్రరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం లభిస్తుందని అనడానికి బోయ మారెప్ప, అల్లూరి వెంకటపతి రాజు నిదర్శనమని తెలిపారు. బదినేహాల్ సహకార సంఘం ఛైర్మన్ పదవి ఎన్నో ఏళ్లుగా ఒకే కుటుంబం చేతిలో ఉందని, ఈ ఛైర్మన్ పదవి సామాన్య కార్యకర్తగా పని చేసే మారెప్పకు దక్కడంతో సొసైటీ చరిత్రలో నిలిచిపోయిందని చెప్పారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన వెంకటపతి రాజుకు రైతు ఎదుర్కొంటున్న సమస్యలపై మంచి అవగాహన ఉందని, ఆయనను కౌతాళం సహకార సంఘం పదవి వరించడం రైతుకు రాజ్యాధికారం అందించినట్లు అయిందని తెలిపారు. రైతులకు సేవలు అందించడానికి రాఘవేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు ఉల్లిగయ్యలు తమకు ఈ అవకాశం కల్పించారని మారెప్ప, వెంకట పతి పతిరాజు పేర్కొన్నారు. రైతులకు అన్ని రకాల రుణాలందించి, సకాలంలో ఎరువులు అందేలా కృషి చేస్తామన్నారు. నాయకులు, అభిమానులు శాలువా, పూలమాలలో సన్మానించారు. టిడిపి సీనియర్ నాయకులు సాయిబాబా, అడివప్ప గౌడ్, తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్, సతీష్ నాయుడు, రాజానందు, సులేకేరి ఈరన్న, పట్టాభి, సుబ్రహ్మణ్యం రాజు, గిరి, మూకన్న పాల్గొన్నారు.

రైతులకు మంచి సేవలందించాలి : దివాకర్ రెడ్డి, చెన్న బసప్ప

కౌతాళం సహకార సంఘం అధ్యక్షులు వెంకటపతి రాజు రైతులకు మంచి సేవలు అందించాలని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు చెన్న బసప్ప, శివ మోహన్ రెడ్డి కోరారు. కౌతాళం సహకార సంఘం ఛైర్మన్‌గా ఎన్నికైన వెంకటపతి రాజును శాలువా, పూలమాలలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు బిడ్డలకే సహకార సంఘం పదవులు కేటాయించడం రైతుల పట్ల గౌరవం ఉందో తెలుస్తుందని తెలిపారు. కొట్రేష్ గౌడ్, దొడ్డనగౌడ్, రమేష్ గౌడ్, కురుగోడు, సిద్ధు, మంజు, రెహమాన్, రాజబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి



వెంకటపతి రాజును సన్మానిస్తున్న నాయకులు

నకిలీ పట్టాల జారీపై విచారణ చేపట్టాలి

- తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని



మాట్లాడుతున్న రమాకాంత్‌రెడ్డి

పెద్దకడబూరులో నకిలీ పట్టాలు జారీ చేసిన వారిపై సమగ్ర విచారణ జరిపించాలని తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్దకడబూరులో కనకదాసు విగ్రహం ఏర్పాటు కోసం 14 సెంట్ల స్థలం కేటాయించినట్లు, ఆ స్థలంపై కొందరు నకిలీ ఇంటి పట్టాలు పొందినట్లు తెలిపారు. వాటిని రద్దు చేసి విగ్రహం ఏర్పాటుకు స్థలం అప్పగించాలని కోరారు. అడ్డదారుల్లో పట్టాలు పొందిన వారిపై సమగ్ర విచారణ జరిపి.. సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోరంబోకు స్థలాలు, మిగులు భూములు లక్ష్యంగా అధికారుల సంతకాలు సైతం బోగస్ చేసి అడ్డదారుల్లో పట్టాలు పొందారన్నారు. త్వరలోనే గ్రామాన్ని సందర్శించి స్థలాన్ని అప్పగిస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. గ్రామ నాయకులు నరసన్న, వెంకటేష్, నాగేంద్ర, నాగప్ప, రాముడు, కురువ నరసింహులు ఉన్నారు.

జాగ్రత్తలతో క్షయ నివారణ


ప్రజాశక్తి - ఆదోని

తగిన జాగ్రత్తలు పాటిస్తే క్షయ వ్యాధిని సమూలంగా అరికట్టవచ్చని హనుమాన్ నగర్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ సాగర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని రాజా రాజేశ్వరి నగర్‌లో టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కింద అవగాహన ర్యాలీ నిర్వహించారు. పేద క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. సూపర్‌వైజర్లు బాబురాజు, జ్ఞానేశ్వర్, సుబ్బమ్మ బాయి, ఎఎన్ఎం శ్రీదేవి, ఆశావర్కర్లు అంజలి, భారతి, మల్లీశ్వరి, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు

- ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి - ఆస్పరి



మాట్లాడుతున్న ఎంపిడిఒ గీతావాణి

మండల సర్వసభ్య సమావేశాల్లో సమస్యలు పరిష్కరించే దిశగా తీర్మానాలు చేసుకోవడానికే మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తున్నారు.. తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదని, పంచాయతీలో నిధులు లేవని, గ్రామాల్లో సమస్యలు ఎలా పరిష్కరించాలని తొగలగల్లు సర్పంచి అంజినయ్య, బిణిగేరి సర్పంచి వెంకటేష్ అధికారులను ప్రశ్నించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సుకర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ గీతావాణి మాట్లాడుతూ... పంచాయతీలకు త్వరలో 15వ ఫైనాన్స్ నిధులు మంజూరవుతాయని, ప్రజాప్రతినిధులు అపోహలు పెట్టుకోవద్దని తెలిపారు. గ్రామాల్లో శానిటేషన్ చేయాలన్నారు. విద్యుత్ ఎఇ ఆంజనేయ శాస్త్రి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ సోలార్ పథకంపై ప్రజలకు వివరించాలని సూచించారు. ఆయా శాఖ అధికారులు మాట్లాడిన అనంతరం ఎంపిడిఒ గీతా వాణి మాట్లాడుతూ... గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చూడాలని, దోమలు వృద్ధి చెందకుండా శానిటేషన్ చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలి: సిపిఎం

మండలంలోని 33 గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, మండల కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు రవి, మధు రెడ్డి కోరారు. మండల సర్వసభ్య సమావేశాన్ని సిపిఎం నాయకులు అడ్డుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోని మండలం నాగనాథనహళ్లి నుంచి ఆస్పరికి వచ్చే నీటిని ఆదోని మండలంలోని ఐదు గ్రామాలు అక్రమ కలెక్షన్ల ద్వారా నీటిని వాడుకోవడం వల్ల ఆస్పరికి నీటి సమస్య తలెత్తిందన్నారు. అక్రమ కలెక్షన్లను తొలగించాలని పేర్కొన్నారు. పందికోన రిజర్వాయర్ నుంచి జొహరాపురం గ్రామం వరకు పైపులైన్ వేసి ఎస్ఎస్ ట్యాంకు ఏర్పాటు చేస్తే ఆస్పరి మండలానికి తాగునీటి సమస్య తీరుతుందన్నారు. ఎంపిపి ఉమాదేవి మాట్లాడుతూ... ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నాగనాథనహళ్లి వాటర్ స్కీముకు వేసుకున్న అక్రమ కలెక్షన్లను తొలగించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మనోవేదనతో భార్య మృతి

- ఆరు రోజుల క్రితం గుండెపోటుతో భర్త మృతి - అనాథలైన పిల్లలు

ప్రజాశక్తి - ఆస్పరి




భర్త చనిపోయాడనే మనోవేదనతో భార్య మృతి చెందిన సంఘటన నగరూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఆరు రోజుల్లోపే తల్లిదండ్రులు మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. వివరాలిలా ఉన్నాయి... ఈనెల 16న మహాదేవుడు (50) గుండెపోటుతో మృతి చెందారు. మనోవేదనకు గురైన భార్య రంగమ్మ (40) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. తల్లిదండ్రులు మృతి చెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. ఆ కుటుంబానికి పెద్ద దిక్కైన తల్లిదండ్రులు చనిపోవడంతో పిల్లలు విలపిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. మహాదేవుడు, రంగమ్మకు ముగ్గురు ఆడపిల్లలు. పెద్దకుమార్తె మౌనికకు నాలుగేళ్ల క్రితం పెళ్లి చేశారు. రెండో కుమార్తె శ్యామల డిగ్రీ పూర్తి చేశారు. మూడో కుమార్తె భూమిక గతేడాది 10వ తరగతి ఉత్తీర్ణత సాధించారు. తల్లి ఆరోగ్యం బాగా లేకపోవడంతో చదువు మానేసి ఇంటి దగ్గరే ఉంటూ తల్లి ఆలన, పాలన చూసుకుంటూ ఉన్నారు. మహాదేవుడుకు చిన్న ఇల్లు తప్ప పొలం, ఆస్తి ఏమీ లేదు. భార్య కొన్నేళ్ల క్రితం క్యాన్సర్ బారిన పడడంతో కర్నూలులో ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయిస్తూ దాదాపు రూ.12 లక్షల దాకా అప్పు చేశారు. ఈనెల 16న చివరి దశలో ఉందని, ఇంటికి తీసుకెళ్లమని వైద్యులు చెప్పడంతో మనోవేదనకు గురై అక్కడే స్పృహ తప్పి కిందపడి గుండెపోటుతో మృతి చెందారు. అప్పటికే అనారోగ్యం బారిన పడిన భార్య రంగమ్మ భర్త చనిపోయాడని దిగులుతో నాలుగు రోజుల నుంచి మంచి నీళ్లు కూడా ముట్టలేదు. సోమవారం మృతి చెందారు. ఆ కుటుంబాన్ని సర్పంచి సావిత్రమ్మ పరామర్శించారు. మహాదేవుడు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

'అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి'



మున్సిపల్ కార్మికుల సమ్మెను ప్రారంభించి మాట్లాడుతున్న రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు డిమాండ్ చేశారు. సోమవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సమ్మెను రామాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు గ్రాట్యుటీ, పింఛను సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పందించి పారిశుధ్య కార్మికులకు గ్రాట్యుటీ, పింఛను, 62 ఏళ్ల సర్వీసు రిటైర్మెంట్ బెనిఫిట్స్, మృతి చెందిన కుటుంబాలకు ఉపాధి కల్పించే విధంగా వారసత్వ హక్కు, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. నిర్లక్ష్యం చేస్తే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మె శిబిరం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.ఇస్మాయిల్, జై నాగరాజు, బి.కేశన్న, బి.రంగస్వామి, మల్లికార్జున, బి.సాల్మన్, కె.ఖాజా, బడే సాబ్, బి.మునీంద్ర, విక్రమ్, రైతు సంఘం నాయకులు అబ్దుల్లా, శివ పాల్గొన్నారు.

'బిడ్డకు తల్లి పాలు అమృతం లాంటివి'

ప్రజాశక్తి - దేవనకొండ

పుట్టిన ప్రతి బిడ్డకూ తల్లిపాలు అమృతం లాంటివని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు తెలిపారు. దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కరివేముల గ్రామంలో సోమవారం సంచార చికిత్స కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించాలని, చక్కెర నీళ్లు, తేనె తాగించకూడదని తెలిపారు. తల్లిపాలు మాత్రమే తాగించాలని సూచించారు. బిడ్డకు కావాల్సిన పోషకాలు ముర్రుపాలలో ఉంటాయన్నారు. తల్లిపాల వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, బిడ్డకు 6 నెలలు నిండేదాకా కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని తెలిపారు. వైద్యాధికారి విజయభాస్కర్, ఆరోగ్య విద్యా బోధకులు జయలక్ష్మి, సామాజిక ఆరోగ్య అధికారి సాయినందిని, ఆరోగ్య కార్యకర్త రామేశ్వరి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



సంచార కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రఘు

విద్యార్థులంటే అంత చులకనా..?

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణం నుంచి ఎర్రకోట ఇంజినీరింగ్ కళాశాల వరకు ప్రత్యేక విద్యార్థి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నా, ఆర్‌టిసి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, విద్యార్థులంటే అంత చులకనా అంటూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు ప్రశ్నించారు. సోమవారం కళాశాల విద్యార్థులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, సబ్ కలెక్టర్ మౌర భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని పట్టణం నుంచి 150 నుంచి 200 విద్యార్థులు రోజూ కళాశాలకు వెళ్తున్నారని, వారికి సరైన రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో చదువులు మధ్యలోనే ఆపేసిన పరిస్థితి ఉందన్నారు. ఆర్‌టిసి అధికారులు స్పందించి విద్యార్థి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులతో కలిసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నాగరాజు, శశిధర్, నరసింహ, రవి, రాజు, మహేష్ ఉన్నారు.

అధిక ఫీజులపై ఫిర్యాదు : పొల్యూషన్ అండర్ కంట్రోల్ టెస్టింగ్ సర్వీస్ సెంటర్లో అధిక ఫీజులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు సద్దాం హుస్సేన్, వెంకటేష్ మాట్లాడుతూ... పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ జారీ చేయడానికి ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా అధిక ఫీజులతో పొల్యూషన్ సర్టిఫికెట్ జారీ చేస్తున్నారని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌టిఒ ఆఫీస్ అధికారులు నిర్లక్ష్యం వీడి.. ప్రమాణాలు పాటించి సర్టిఫికెట్లు జారీ చేయాలని తెలిపారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న ఆల్ఫ్రెడ్ రాజు

'పేద, మైనార్టీల ఇళ్ల కూల్చివేతను ఆపాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అస్సాంలో పేద, మైనార్టీల ఇళ్లను కూల్చడం ఆపేయాలని ఎస్‌డిపిఐ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎస్‌డిపిఐ పట్టణ ఉపాధ్యక్షులు హాజీ ఖాదర్ బాష మాట్లాడుతూ... అస్సాంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, పేదలు, అణగారిన వర్గాల, మైనార్టీల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చేయడం అన్యాయమని విమర్శించారు. పట్టణ కార్యదర్శి హాఫీజ్ అబ్దుల్ షకూర్ మాట్లాడుతూ... బిజెపి మత రాజకీయాలు చేస్తూ ముఖ్యంగా మైనార్టీలను హింసించి, మైనార్టీలను బూచిగా చూపించి మెజారిటీ ఓట్లు పొందాలనే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు మాట్లాడుతూ... దేశంలో ఎల్లవేళలా మైనార్టీలను, రైతులను, కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న బిజెపి ప్రభుత్వం గద్దె దిగేదాకా పోరాడతామని తెలిపారు. 9వ వార్డు ఇన్‌ఛార్జి మక్బూల్, వాహీద్, మహబూబ్, చాంద్, సలాం, హుస్సేన్, షేక్షావలీ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - మంత్రాలయం



స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద జరిగిన హత్య కేసులో నిందితుని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఉపేంద్ర బాబు తెలిపారు. సోమవారం స్థానిక సిఐ కార్యాలయంలో నిందితుని మీడియా ముందు ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా మల్కాపురం గ్రామానికి చెందిన నరసమ్మ కుమారుడు బోయ దుల్లయ్యతో మాధవరం గ్రామానికి చెందిన తలారి దగ్గు రామకృష్ణకు ఉన్న స్నేహబంధం ఉందని తెలిపారు. ఈనెల 17న సాయంత్రం 6.30 గంటల సమయంలో తమాషా చేస్తూ కాలితో తన్ని దుల్లయ్యను వెనక్కి తోశారని, సిసి రోడ్డుపై వెల్లకిల పడిన దుల్లయ్య తీవ్ర గాయంతో మృతి చెందారని చెప్పారు. మృతుని సోదరుడు అంజనయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం సూగూరు క్రాస్ రోడ్డు వద్ద నిందితుని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. సిఐ రామాంజులు, ఎస్‌ఐ శివాంజల్, పోలీసులు సోమశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.

తప్పు చేసి కప్పి పుచ్చుకోవడమే జగన్ నైజం : ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

మద్యం పాలసీలో సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడి.. ఎంతోమంది జీవితాలను కష్టాల్లో పడేసి.. నేడు ఎలాంటి తప్పు చేయలేదని అనడం మాజీ ముఖ్యమంత్రి జగన్ నైజమని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి విమర్శించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసిపి హయాంలో క్వార్టర్ ధర గత ప్రభుత్వంతో పోలిస్తే ఎందుకు అంత ఎక్కువ పెంచారో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని తెలిపారు. లిక్కర్ మాఫియా ద్వారా సంపాదించిన డబ్బును ఎక్కడికి మళ్లించారో కూడా ప్రజా క్షేత్రంలో బయట పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ లిక్కర్ కార్యకలాపాల్లో అవినీతి జరిగినందుకే అరెస్టుల పర్వం కొనసాగుతోందని తెలిపారు. తప్పు చేసినందుకే 42 మందిపై కేసులు నమోదయ్యాయని చెప్పారు.



మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

నూతన పైపులైన్ ఏర్పాటు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నగరడోన గ్రామంలో పంచాయతీ నిధులతో నూతన పైపులైన్ పనులు చేపట్టినట్లు సర్పంచి మల్లమ్మ భర్త నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ తెలిపారు. సోమవారం నూతన పైపులైను పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొత్త సచివాలయం నుంచి ట్యాంకు వరకు పైపులైను నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. నూతన పైపులైను వేయడం వల్ల తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. పైపులైన్ వేస్తుండడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం : సిఐ

ప్రజాశక్తి - చిప్పగిరి




ప్రజలు ముఖ్యంగా మహిళలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. సోమవారం చిప్పగిరి పోలీసు స్టేషన్‌లో రికార్డులను, ఈ మధ్యకాలంలో నమోదైన కేసుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ మధ్యకాలంలో చదువుకున్న మహిళలు కూడా తెలియని లింకులపై క్లిక్ చేసి నష్టపోయిన సంఘటనలు చూశామన్నారు. ప్రతి ఒక్కరూ మొబైల్‌లో వచ్చిన లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. ఇంట్లో చదువుకున్న వారికి చూపించాలని తెలిపారు. తెలియని వారు ఫోన్ చేసి మీ మొబైల్‌కు ఒటిపి వస్తుందని, చెప్పాలని చేస్తుంటారని, పొరపాటున కూడా ఒటిపి చెప్పవద్దని, చెబితే ఖాతాలోని డబ్బులన్నీ కాజేస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరూ చాలా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలో ప్రతి గ్రామమూ ప్రశాంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలీసులు ఖాదర్ వలీ, షబ్బీర్, శంకర్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు విస్తరిస్తాం

- అధ్యక్ష, కార్యదర్శులు సైఫుల్లా, మేఘనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

రోటరీ క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు విస్తరిస్తామని ఆదోని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సైఫుల్లా, మేఘనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జూబ్లీ హాలులో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నామిని త్రివిక్రమ్ జోషి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ సత్తార్ హాజీ, ముఖ్య అతిథిగా ఆదిత్య నర్సింగ్ హోమ్ డాక్టర్ శ్రీనివాసులు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ సైఫుల్లా, మేఘనాథ రెడ్డి, ట్రెజరర్‌గా షణ్ముఖ, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోలియోను అంతమొందించడంలో రోటరీ సేవలు ఎనలేనివని తెలిపారు. అంతకు ముందు గతేడాది రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి మాజీ అధ్యక్షులు సందీప్ రెడ్డి వివరించారు. రోటరీ క్లబ్ సభ్యులు జీవన్ సింగ్, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ మల్లికార్జున రెడ్డి, ప్రశాంత్ గాంధీ, భరత్ షా, సునీల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాచోటి సుబ్బయ్య, వినోద్ జైన్, వికాస్ జైన్, పద్మనాభయ్య శెట్టి, సోమశేఖర్ రెడ్డి, సాబీర్ అహ్మద్, అమిత్ గాంధీ, ఇతేష్, విట్టా రాజేష్, హుస్సేన్ పాల్గొన్నారు.




విద్యాహక్కు చట్టం అమలు చేయని 'భాష్యం'పై చర్యలు తీసుకోవాలి

- ఆర్‌టిఇ ప్రయివేట్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని భాష్యం స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆర్‌టిఇ ప్రయివేట్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాది, సామాజిక ఉద్యమ కార్యకర్త అడ్డాకుల తిమ్మప్ప మాట్లాడారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచిత విద్యకు ఎన్నికైన విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వకుండా వేధిస్తున్న భాష్యం స్కూల్ ప్రిన్సిపల్‌పై కేసులు నమోదు చేసి, స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లిస్తేనే పిల్లలకు పుస్తకాలు ఇస్తామని, లేకపోతే టిసి ఇచ్చి పంపుతామని చెబుతున్నారని మండిపడ్డారు. గతేడాది కూడా ప్రిన్సిపల్ వ్యవహార శైలి ఇలాగే ఉంటే తహశీల్దార్ శేషిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ప్రయివేట్ స్కూల్స్, పేరెంట్స్ అసోసియేషన్‌తో కలిసి సమావేశం ఏర్పాటు చేసి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారని తెలిపారు. ప్రిన్సిపల్‌లో ఎటువంటి మార్పు రాలేదని చెప్పారు. విద్యార్థులను వేధిస్తున్న ప్రిన్సిపల్‌పై విచారణ చేపట్టి, స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ శేషఫణికి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఆర్‌టిఇ ప్రయివేట్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు చిన్న హుస్సేని, పురుషోత్తం, రవి, ఖడ్గ, రాజు, సుజిత్, జనార్ధన్, జయరాం, మోషే, వీరయ్య, నరేష్, శాంతి రాజు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బాధితులు

హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక బిసి సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యుఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను వారు వినతిపత్రం అందజేశారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పనకు తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్యదర్శి ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. మెస్, కాస్మోటిక్ చార్జీలను కూడా వెంటనే విడుదల చేయాలన్నారు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని డివైఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్ర, శ్రీనివాసులు విమర్శించారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ, మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మండలంలో ప్రధాన రోడ్లయిన ఈదుల దేవరబండ నుంచి బేతపల్లి, కప్పట్రాళ్ల నుంచి బండగట్టు, కర్నూలు, బళ్లారి రోడ్డు నుంచి పొట్లపాడు రోడ్డు, ఇంకా చాలా గ్రామీణ ప్రాంతాల రోడ్లు అసౌకర్యంగా ఉన్నాయని చెప్పారు. ఈ రోడ్లపైకి రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఉందన్నారు. దేవనకొండలో డిఎన్‌టి హాస్టల్‌ను పునరుద్ధరించాలని, ఈ ప్రాంతం విద్యార్థుల కలగా ఉన్న మోడల్ స్కూల్ నిర్మాణాన్ని చేపట్టాలని, కెజిబివిని తరచూ సందర్శించి విద్యార్థులకు సరైన వసతులు కల్పించేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. డివైఎఫ్‌ఐ మండల నాయకులు చిన్న వీరేంద్ర, నాయుడు, మహేష్, వీరన్న, హనుమంతు, చిన్న రవికృష్ణ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అచ్చుతానందన్‌కు సిపిఐ నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిపిఎం అగ్ర నాయకులు కేరళ మాజీ ముఖ్యమంత్రి అనారోగ్యంతో మృతి చెందడం దేశంలో వామపక్ష ఉద్యమానికి తీరనిలోటని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలను, నిర్వహించిన పోరాటాలను కొనియాడారు. విఎస్.అచ్యుతానందన్ అలుపెరుగని పోరాటయోధుడని 1967 నుంచి 2016 సంవత్సరం వరకు కేరళ అసెంబ్లీకి ఎన్నికైన ఆయన 2006 నుండి 2011 వరకు కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా,మూడుసార్లు విపక్షనేతగా పనిచేశారన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో భూ ఆక్రమణదారులు, అవినీతిపరుల పైన ఉక్కు పాదం మోపారన్నారు. ఆయన మృతికి సిపిఐ జిల్లా సమితి తరపున ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

క్లస్టర్ విద్యార్థికి అరుదైన అవకాశం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్



క్లస్టర్ యూనివర్సిటీ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ ద్వితీయ బిఎస్‌సి విద్యార్థి వై.మహేష్ నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలకు ఎంపికై అరుదైన అవకాశం పొందారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటబసవరావు రిజిస్ట్రార్ కట్ట వెంకటేశ్వర్లు ప్రిన్సిపల్ ఇందిరా శాంతి విద్యార్థి వై మహేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ నాయుడు, క్లస్టర్ యూనివర్సిటీ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాలతో డిఇఒ మీటింగు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ సోమవారం డిఇఒ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాలతో భేటీ అయ్యారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ నవీన్ పాటి, ఎస్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోకారి జనార్ధన్ ,ఎపిటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్ మరియానందం, ఎపిటిఎఫ్ 257 జిల్లా అధ్యక్షుడు రంగన్న పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అప్ట జిల్లా అధ్యక్షుడు సేవాలాల్ నాయక్ లు పాల్గొన్నారు. సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థుల హాజరు పెంచుటకు ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలన్నారు.బదిలీ అయిన ప్లేస్ లో 50శాతం స్టాఫ్ ఉన్న దగ్గర వారి వెంటనే రిలీజ్ చేయాలన్నారు. ఇన్ సర్వీసు ఉపాధ్యాయుల జీతాల సమస్యను త్వరగా పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాలు నేతలు కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు అనేక సమస్యలు డిఇఒ దృష్టికి తెచ్చారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో విద్యారంగ సమస్యను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌ఎండి రఫీ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌ఎండి రఫీ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగులో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్సుమెంట్స్ విడుదల చేయాలన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు షాహీద్, జిల్లా సహాయ కార్యదర్శి కె.సోమశేఖర్ మద్రిస్వామి, అఖిల్, పివైఎల్ జిల్లా నాయకులు నవీన్, సురేంద్ర, పిడిఎస్‌యు జిల్లా నాయకులు వినోద్, కిరణ్, వంశీ, హరి, వినయ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడండి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

కొల్లంపల్లితంతా గ్రామం సమీపంలో కృష్ణకాంత్ కంకర క్వారీ నుండి వెదజల్లుతున్న దుమ్ము ధూళి ద్వారా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్‌దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకుగాను తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో కంకర ఫ్యాక్టరీ నిర్మించిన అనంతరం భారీ వాహనాలు తిరగడంతో రోడ్డు కూడా దెబ్బతిందన్నారు. ఈ రోడ్డు దెబ్బతినడంతో చెరువు కట్టమీద ప్రజలు రాకపోకలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ సమస్యను సిఎం దృష్టికి తీసుకువెళ్లిన అధికారులు గ్రామాన్ని సందర్శించి ఎలాంటి చర్యలు తీసుకోకుండా వెళ్లిపోయారన్నారు. వెంటనే తమ జోక్యం చేసుకొని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని వారు విన్నవించారు.



విద్యార్థులకు సౌకర్యాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-సి బెళగల్

విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎంఇఒ ఆడమ్ బాషా పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఐదు క్లస్టర్ కేంద్రాల హెచ్‌ఎంలతో సమీక్షించి పలు పాఠశాలల్లో విద్యార్థులతో ముచ్చటించారు. ఇక్కడే గతంలో సౌకర్యాల కొరత జాబితా తయారు చేశారని అందులో భాగంగా పరిశీలన చేసి తదుపరి నివేదికలు ఉన్నత అధికారులకు పంపుతునట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన వంటా వార్పు అందిస్తుందని ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని హెచ్‌ఎంలను కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చి దిద్దుటలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని విధుల్లో అలసత్వం ఏమాత్రం తగదని హెచ్చరించారు.

తాగునీరివ్వండి : సిపిఎం

ప్రజాశక్తి పత్తికొండ...

అన్నం తిన్నాక , తాగడానికి తాగునీరు ఇవ్వాలని తుగ్గలి సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం తుగ్గలి తహశీల్దార్ కార్యాలయంలో సిపిఎం నాయకులు తహశీల్దార్ రవిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సచివాలయం పరిధిలోని దేశాయితండా ప్రజలకు తాగునీరు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టీపట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తహశీల్దార్ రవి సానుకూలంగా స్పందిస్తూ ఎంపిడిఒ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు ఫోన్లు చేసి తక్షణమే సమస్యను పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు రంగరాజులు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



అధికారికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు



ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ-ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు 21 అర్జీలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజల నుండి వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పరిష్కారానికి చట్టపరిధిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 21 అర్జీలు రాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఒ జునైద్, ఎంఇ లీలాప్రసాద్, టిపిఆర్ఒ వెంకటలక్ష్మి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, పాల్గొన్నారు.